మెదక్ మున్సిపాలిటీ : పంచముఖి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిజాంపేటలో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మనోహరాబాద్‌లో సామూహిక సత్యనారాయణ వత్రాలు ఆచరిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేటలో పూజలు చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు

తూప్రాన్‌లో హనుమాన్ జయంతి లో పాల్గొన్న రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ

జై హనుమాన్

మెదక్ జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచే అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానకార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మెదక్ పంచముఖి ఆలయంలో 108 లీటర్ల ఆవు పాలతో క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విచ్చేసి పూజలు చేశారు. పలు చోట్ల శోభాయాత్రలు నిర్వహించారు.

-మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఏప్రిల్ 23

మెదక్‌రూరల్ : మంబోజిపల్లి వీరహన్‌మాన్‌ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో స్వామి వారికి చందనాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మెదక్ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

27న మెదక్ ప్రభుత్వ వైద్యశాలలో ఇంటర్వ్యూలు

మెదక్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో గౌరవ వేతన పద్ధతిపై సీనియర్ రెసిడెంట్ 21, ట్యూటర్ 03 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్రకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ రెసిడెంట్ పోస్ట్‌కు ఎండీ, ఎంఎస్/ డీఎన్‌బీ, ఎన్ఎంసీటీఈ క్యూ రెగ్యులేషన్ 2022 ప్రకారం ఎంబీబీఎస్ అడిషనల్ క్వాలిఫికేషన్ తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ట్యూటర్ సీనియర్ రెసిడెంట్ పోస్టులకు 45 ఏళ్లు లోపు, ట్యూటర్ ఎంబీబీఎస్ తెలంగాణ మెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బయట రాష్ట్ర అభ్యర్థులు నియామకాన్ని ధ్రువీకరించడానికి ఎంపికైన వారం రోజుల్లో స్టేట్ మెడికల్ కౌన్సిల్ నుంచి తమ అర్హతను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సీనియర్ రెసిడెంట్ వేతనం రూ.92, 575, ట్యూటర్ వేతనం రూ.55,000 చెల్లిస్తారన్నారు. ఈ నెల 27న మెదక్ జిల్లా ప్ర భుత్వ దవాఖానలోని పర్యవేక్షక చాంబర్‌లో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

నిజాంపేట, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నందిగామ గ్రామంలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక కళాసారథి కళాకారులు ఎన్నికలు, ఓటు హక్కు నమోదుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాసారథి సిద్ధులు మాట్లాడుతూ మెదక్ జిల్లా కలెక్టర్, పౌరసంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాకారులు ఎల్లయ్య, కృష్ణ, విజయలక్ష్మి, దేవదాస్, మాధవి, శేఖర్, ఎల్లం తదితరులు ఉన్నారు.

కోటగడ్డ మర్రిచెట్టుపై పిడుగుపాటు

రామాయంపేట, ఏప్రిల్ 23 : సోమవారం రాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి ధాన్యం మొత్తం నీటిపాలైంది. వర్షం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వాన చినుకులు రావడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపో యింది. రామాయంపేట పురపాలిక పరిధిలోని కోటిగడ్డ ప్రాంతంలోని మర్రిచెట్టుపై పెద్ద ఎత్తున శబ్దంతో పిడుగుపడి గొల్పర్తి గ్రామస్తులను భయాందోళనలకు గురిచేసింది. పిడుగు పాటుతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి.


గొల్పర్తి కోటగడ్డ మర్రిచెట్టుపై పిడుగుపడి వ్యాపిస్తున్న మంటలు

అత్తను హత్య చేసిన అల్లుడు..

వెల్దుర్తి, ఏప్రిల్ 23 : తమ కాపురంలో గొడవలు, భార్య కాపురానికి రాకపోవడానికి అత్తే కారణమని అత్తపై కోపం పెంచుకున్న అల్లుడు అత్తను గొడ్డలితో కొట్టి చంపిన ఘటన వెల్దుర్తి మండల పరిధిలోని శెట్‌పల్లి కలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం, ఎస్సై నవత తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూది కనకమ్మ(58)కి కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉండగా, అందరికీ వివాహాలు చేశారు. కొడుకు నర్సింహులు ఉపాధి కోసం వలస వెళ్లగా, కనకమ్మ శెట్‌పల్లిలోనే నివాసం ఉంటున్నారు. మూడో కూతురు యశోదను మెదక్ మండలం నవాబ్‌పేటకు చెందిన దశరథకు ఇచ్చి 13 ఏండ్ల కింద వివాహం చేశారు. కొన్ని నెలల నుంచి యశోద, దశరథల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండడంతో యశోద భర్తకు దూరంగా తమ్ముడు నర్సింహులుతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. దీనంతటికి అత్త కనకమ్మనే కారణమని పగ పెంచకున్న అల్లుడు దశరథ్ కనకమ్మ చెల్లె బాలమణితో కలిసి శెట్‌పల్లిలోని ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటికి వచ్చి వారితో గొడవ పడి, అక్కడే ఉన్న గొడ్డలితో కనకమ్మ తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ కృష్ణ, వెల్దుర్తి ఎస్సై నవత ఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కనకమ్మ చెల్లె బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు గుణ పాఠం చెప్పాలి

రామోపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్

పెద్దశంకరంపేట,ఏప్రిల్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఎంపపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని రామోజిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కారు గుర్తకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేశ్, మండల రైతుబంధు అధ్యక్షుడు సురేశ్ గౌడ్, మాణిక్యం, వెంకట్‌రెడ్డి, ఉప్పరి సాయలు, ఎంపీటీసీ యాకూబ్, అనంతర్ రావు, శంకరయ్య, తదితరులు ఉన్నారు.

ఏడుపాయల్లో పల్లకీ సేవ

పాపన్నపేట,ఏప్రిల్23 : పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాననీ మాత సన్నిధిలో మంగళవారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకొని పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో మూల విరాట్ అమ్మవారి విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, రవివీర్ కుమార్, మధుసూదన్ రెడ్డి, వరుణాచారి, బత్తిని రాజు, నర్సింహులు, వీరేశం,సభ్యులు పాల్గొన్నారు.

శివంపేట్ కాంగ్రెస్‌లో వర్గ పోరు

నర్సాపూర్, ఏప్రిల్ 23 : శివంపేట్ మండలంలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేధాలు భగ్గుమన్నాయి. సీనియర్లను కాదని నిన్నమొన్న పార్టీలో వచ్చిన నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఓవర్గం నాయకులు మండిపడుతున్నారు. మంగళవారం నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు శివంపేట్ మండల కేంద్రంలోని బగలాముఖి శక్తిపీఠం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ భర్త నవీన్‌గుప్తా ఇంటికి అందరూ కలిసి వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి వెళ్లారు. అక్కడే అసలు కథ మొదలైంది.. శివంపేట్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలోనే ఆవుల రాజిరెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి వచ్చినప్పుడు మాకు సమాచారం ఇవ్వడం లేదని, నిన్నమొన్న పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఎందుకిలా చేస్తున్నారని రాజిరెడ్డిని ప్రశ్నించారు. ఈ విషయంపై రాజిరెడ్డి సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోవడానికి సిద్ధపడడంతో సుదర్శన్‌గౌడ్ వర్గం ఆగ్రహానికి గురయ్యారు. ఈ విషయంపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సస్పెండ్

ఈ తతంగం జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ వర్గానికి చెందిన కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, షేక్ ఆలీన్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ప్రెస్ నోట్ విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేసేంత వరకు వచ్చిందంటే రసాభసా ఎంతలా జరిగిందో అర్థమవుతుందని నాయకులు తెలిపారు.

ఘనంగా వీడ్కోలు

సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

చిలిపిచెడ్, ఏప్రిల్ 23 : మండలంలోని అజ్జమర్రి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడికి తోటి ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ నిర్వహించారు. మంగళవారం అజ్జమర్రి ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ చేస్తున్న కనకయ్యకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణ, మదర్, యుగంధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాల పరిశీలన

చిలిపిచెడ్, ఏప్రిల్ 23 : మండల పరిధిలోని చండూర్‌లో సోమక్కపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో రమ్యాతో కలిసి మండల వ్యవసాధికారి బాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కల్గించొద్దన్నారు.

కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

నిజాంపేట, ఏప్రిల్ 23 : ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డీఏవో గోవింద్ అన్నారు. మంగళవారం నిజాంపేటతో పాటు కల్వకుంట కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి మండల ఏవో రాజ్‌నారయణ, సీఈవోలు శోభారాణి, గోపాల్‌రెడ్డి, టెక్నికల్ ఏవో సతీశ్, ఏఈవోలు శ్రీలత, కావేరి ఉన్నారు.

'గురుకుల'కు రామంతాపూర్ తండా విద్యార్థుల ఎంపిక

వెల్దుర్తి, ఏప్రిల్ 23 : మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు ఐదో తరగతిలో గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నవీన్ కుమార్ తెలిపారు. గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మీఫౌండేషన్ ప్రోత్సాహక బహుమతులను మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు ఉదయశ్రీ, శాంతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపు తథ్యం

మెదక్ జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్, ఏప్రిల్ 23 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నిస్వార్థంగా ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని మెదక్ జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్‌లో మంగళవారం ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీ కూడా అమలు కాలేదని, అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను దొంగదెబ్బ తీసిన సర్కార్‌కు సవాలుగా నిలువాలంటే తమ అమూల్యమైన ఓటును బీఆర్ఎస్‌కు వేసి, వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ, నాలుగు నెలల్లోనే పందేండ్లు వెనుకకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : జిల్లా కేంద్రంలోని గుల్షణ్‌క్లబ్‌లో రెంజుకి షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, 50 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి పలు బెల్టులు సాధించినట్లు కరాటే మాస్టార్ దినాకర్ తెలిపారు. కరాటే మాస్టర్లు రియాజ్, నితన్య, అబ్దుల్లా, విశిష్ట రాజ్, స్వరూప్, మనివర్ధన్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

రామాయంపేట రూరల్, ఏప్రిల్ 23 : రామాయంపేట మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు, బావుల వద్ద ఉన్న ధాన్యం కుప్పలు పూర్తిగా నానిపోయాయి. కొన్ని చోట్ల ఈదురు గాలుల వల్ల ధాన్యం కొట్టుకుపోయింది. కేంద్రాల వద్ద టార్పలిన్లు అధికారులు ఏర్పాటు చేసి ఉంటే కొంత మేరకు మేలు జరిగి ఉండేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో కొట్టుకుపోయిన ధాన్యం

బాలికపై కొండెంగ దాడి

రామాయంపేట, ఏప్రిల్ 23 : పాఠశాలకు బ్యాగు పట్టుకుని వెళ్తున్న ఓ పన్నెండేండ్ల బాలికపై కొండెంగ దాడి చేసిన సంఘటన రామాయంపేట పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలిక సాదుల గాయత్రి ఎప్పటిలాగే పాఠశాలకు చివరి రోజు కావడంతో పుస్తకాలను బ్యాగుతో బయలు దేరింది. ఇంతలోనే ఒక్కసారిగా కొండెంగ బాలికపై దూకి బాలికను కరిచింది. బాలిక స్పృహతప్పి అక్కడే డ్రైనేజీలో పడిపోయింది. బాలిక మెడలో ఉన్న బ్యాగును కొండెంగ ఎత్తుకెళ్లింది. బాలికకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే అక్కడకు చేరుకున్న కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్ మల్యాల కవిత కిసన్ వెంటనే అటవీశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్టు సిబ్బంది అక్కడి ప్రాంతంలో కొండెంగ కోసం గాలింపు చేపట్టారు.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించాలి

తూప్రాన్, ఏప్రిల్ 23 : పదేండ్లుగా దేశాన్ని పాలిస్తున్న కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని కార్మిక లోకమంతా ఏకమై లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. తూప్రాన్ పట్టణంలోని శివసాయి ఫంక్షన్‌హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన 'పార్లమెంటు ఎన్నికల-కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లిస్తే తప్పా సగటు కార్మికుడు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, సభ్యులు యాదగిరి, బాలేశ్, ఇంద్రేశ్, వినయ్‌కుమార్, నవీన్, శంకర్, వెంకటేశ్, స్వామి, కార్మికులు పాల్గొన్నారు.

అనుమానంతో ఉపాధ్యాయుడి హత్య

చేగుంట, ఏప్రిల్ 23: మాసాయిపేట జడ్పీహెచ్ఎస్‌లో హిందీ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నాగరాజు హత్య మిస్టరీని చేగుంట పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు కారకులైన నిందితులను అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అనంతరం రామాయంపేట సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ బి.వెంకటేశం మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా వినాయక్‌నగర్‌కు చెందిన మోత్కూరి అవుసుల నాగరాజు (53) చేగుంట మండలం మాసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. నాగరాజు కనిపించడం లేదని ఈ నెల1న చేగుంట పోలీసుస్టేషన్‌లో అతడి కొడుకు వంశీధర్ ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 22న చేగుంటలో నివాసముంటున్న వంగ సత్యనారాయణ (సతీశ్)ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఆయన నేరం ఒప్పుకున్నాడు. ఈ నేరానికి గల కారణాలు వివరిస్తూ తన భార్య వంగ స్వాతీ (మాధవి)తో మోత్కూరి నాగరాజుకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తన బావమరిది వర్కాల మల్లేశం, స్నేహితుడు సునీల్‌గౌడ్‌తో కలిసి గత నెల 28న కొట్టి చంపినట్లు ఒప్పుకున్నారు. మరుసటి రోజు నాగరాజు మృతదేహాన్ని ఓ అద్దె కారులో వేసుకుని ప్రగతినగర్ చెరువులో పడేసినట్లు తెలిపారు. ప్రగతి నగర్ చెరువులో వేతుకగా, మృతదేహం లభించింది. దీంతో కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన చేగుంట ఎస్సైలు బాలరాజ్, నారాయణ, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది నాగభూషణం, భాస్కర్, నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

నర్సాపూర్, ఏప్రిల్ 23 : నర్సాపూర్ మండల సమీపంలో బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఇంగ్లిష్ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బీవీఆర్ఐటీ కళాశాల లోని బీవీ రాజు నాలెడ్జ్ సెంటర్ ద్వారా వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తరగతులు ఏప్రిల్ 29 నుంచి మే 22 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు మాత్రమే అర్హత కలిగి ఉంటారన్నారు. పూర్తి వివరాలకు 9849525808, 9866244 277 నెంబర్లకు ఫోన్ చేసి ఈ నెల 27 లోపు పేరు నమోదు చేసుకోవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బాపిరాజు, విష్ణు హైస్కూల్ ప్రిన్సిపాల్ జామీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


పెద్దశంకరంపేటలో బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బీబీ పాటిల్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23 : నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టెంకటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుధాకర్, మఖ్తు లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ సురేశ్, మల్కాపురం గ్రామానికి చెందిన దాసరి నారాయణ, వెంకటేశం, సాయిలు, రమేశ్, పలువురు యువకులు బీజేపీలో చేరగా, బీబీ పాటిల్ కండువాలు వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోనం విఠల్, మాజీ సర్పంచ్‌లు సూర్య ప్రకాశ్, అశోక్, సుభాశ్, గంగారాం, తదితరులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : మెదక్ పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు నల్లాల విజయ్‌కుమార్, మధుసూదన్, నాగరాజు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చందాయిపేటలో ..

చేగుంట,ఏప్రిల్ 23: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా చేగుంట మండలం చందాయిపేటలో మంగళవారం నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో చింతాల భూపాల్, బాల్‌చందర్, పాండు, గొవింద్, అంజి, జ్యోతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23 : క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ప్రాజెక్టు హెడ్ మేఘన, మేనేజర్ ఖాజా మైనుద్దీన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యూబ్‌రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. పీఆర్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 23 : కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మెదక్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. జంబికుంట ప్రాంతంలోని సాయిబాబా దేవాలయం వద్ద రోడ్డుపై వెళ్తున్న దుర్గాప్రసాద్ కుక్క ఆకస్మాతుగా దాడి చేయడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురిపై అదే కుక్క దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. వీరిని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందజేసి ఇంటికి పంపించారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LAND FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915
NT-5273

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.